RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 13 ఆగస్ట్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:65

## గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం

**సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి...**

**పరిహారం.. పునరావాసం చెల్లింపులు వేగవంతం చేయండి..**

**గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీని నియమించండి..**

**నీటి పారుదల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైదరాబాద్: గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని, ఈ విషయంలో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ నియమించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫాం హౌస్ లో పండిన వరి కి వచ్చిన ధర...తెలంగాణ రైతులకు కూడా చెప్పండి కేటీఆర్. మంత్రి శ్రీధర్ బాబు



అసత్యాలతో కేటీఆర్ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయి.
మేము కోటిన్నర కు ఇచ్చిన భూమి ని...బిఆర్ఎస్ ప్రభుత్వం 90 లక్షల కే ఇచ్చింది.
నిబంధనల మేరకే భూ కేటాయింపు లు జరిగాయి.
5 ఎకరాల భూమి ని 7.5 కోట్ల కు ఇచ్చాం..
కేటీఆర్ 200 కోట్లు ఎక్కడివో చెప్పాలి.
హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుంది.
పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్ కు మంచిది కాదు.
తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైంది కాదు.
మాపైన ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజల పై చూపకండి.
బిఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం తొ ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ ని ఓడించారు.
అభివృద్ధి విషయంలో అన్ని ప్రభుత్వాలు కొనసాగించాయి...మేము కొనసాగిస్తున్నాం.
నీటి వాటాల్లో తెలంగాణ కు బిఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసింది.
మా వాట విషయం లొ రాజీపడం.
GRMB మీటింగ్ కు అటెండ్ అవుతాం...బలంగా కొట్లాడుతాం..

## మీరు కొంచెం మారారు: మోదీతో ఖర్గే సరదా వ్యాఖ్య

**సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో అరుదైన దృశ్యం**

**ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేతల మధ్య సరదా సంభాషణ**

**రాజకీయాలకు అతీతంగా నేతల మధ్య కనిపించిన స్నేహపూర్వక వాతావరణం**

రాజకీయాల్లో నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలతో తలపడే అగ్ర నేతలు, ఒకే వేదికపై ఆత్మీయంగా పలకరించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీల మధ్య చోటుచేసుకున్న ఓ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్ ఇటీవల ఢిల్లీలో ఘనంగా జరిగింది. శరద్ పవార్ నివాసంలో నిర్వహించిన ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కరచాలనం చేయడంతో పాటు, ప్రియాంక గాంధీని "ఎలా ఉన్నారు?" అని ఆత్మీయంగా పలకరించారు. "నేను బాగున్నాను సర్, మీరు ఎలా ఉన్నారు" అని ప్రియాంక గాంధీ అడగడంతో, నేను ఎప్పటిలాగే ఉన్నాను అని ప్రధాని మోదీ అన్నారు.ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకుంటూ, ప్రధాని మోదీని ఉద్దేశించి "ఆప్ థోడా సా బదల్ గయే హో" (మీరు మునుపటి కంటే కొంచెం మారారు) అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. దీనికి మోదీ ఆశ్చర్యపోతూ "అవునా?" అని బదులిచ్చి, ఖర్గే భుజంపై చేయి వేసి నవ్వారు. వీరి మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణను చూసి రాహుల్ గాంధీ కూడా నవ్వడం వీడియోలో కనిపిస్తోంది. సుప్రియా సూలే కుమార్తె రేవతి, నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సారాంగ్ లఖానీల వివాహం ఈ ఏడాది జూన్‌లో ముంబైలో జరిగింది. తాజాగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. రాజకీయంగా తీవ్ర వైరుధ్యాలు ఉన్నప్పటికీ, నేతల మధ్య కనిపించిన ఈ స్నేహపూర్వక వాతావరణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## పేదల సొంతింటి కలకు కేంద్రం చేయూత

**మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

**కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి**



మిగతా 2 లో

తెలంగాణకు 11.56 లక్షల PMAY-G ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి.. తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

హైదరాబాద్ ఆగస్టు 12: తెలంగాణ గ్రామీణ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ (PMAY-G 2.0) కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 14న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా మహాత్మా పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ.

**సమిష్టి ఐక్యతను చాటుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.**

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ ఏర్పాట్లపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని ఎస్.ఆర్. శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు బీసీ నాయకులకు విజయవంతమైన ప్రాతినిధ్యం కల్పించే దిశగా మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 14న ఉదయం క్యాబినెట్ సమావేశం అనంతరం సాయంత్రం 4 గంటలకు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తినిచ్చిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలేల సేవలు, ఆశయాలను స్మరించుకునే ఈ కార్యక్రమంలో అన్ని బి.సి వర్గాలు సమిష్టిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమ ప్రాంగణ అలంకరణ, సభా మైదానంలో ఏర్పాట్లు, రవాణా, భద్రత, ఇతర అవసరాలకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వేదిక ఏర్పాట్లను ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన ప్రణాళికతో రూపొందించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లకు వారి హోదాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట ప్రత్యేక డయాస్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఎలాంటి సమన్వయ లోపాలకు తావులేకుండా సంబంధిత శాఖలు, పరస్పర సమన్వయంతో పనిచేయాలని, పకడ్బందీ రూట్ మ్యాప్‌లను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సమిష్టి బాధ్యతగా భావించి విజయవంతం చేయడానికి తమ పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. పూలే పేరుతో ప్రగతి భవన్‌కు పేరు మార్చడం, ప్రస్తుత విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం వంటి చర్యలను ఆయన అభినందించారు. మహాత్మా జ్యోతిరావు పూలే విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతను, మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన మార్గదర్శక కృషిని ఆయన గుర్తుచేస్తూ, వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని అన్నారు. కుల సంఘాలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామకాన్ని, వారికి కార్యాలయం, వసతి సౌకర్యాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలను కూడా ఆయన స్వాగతించారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించి, బీసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి, సమిష్టి ఐక్యతను చాటుతూ కార్యక్రమాన్ని ఘనవిజయం చేయాలని పిలుపునిచ్చారు.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ, నెక్లెస్ రోడ్డులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. విగ్రహావిష్కరణ వేదికను స్వయంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. ప్రాంగణం, వేదిక, రవాణా, భద్రత, ఇతర అవసరాలకు సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సంబంధిత శాఖలు, సమర్థవంతంగా సమన్వయం కలసి పని చేయాలని సూచించారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు, ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాలు, వాటి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీసీ కుల సంఘాలు, ప్రతినిధులు తమ సహకారాన్ని అందిస్తూ పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయాలని కోరారు.

బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి సమావేశంలో పాల్గొని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గౌరవ మంత్రి గారి సూచనలను తప్పక పాటిస్తూ విగ్రహావిష్కరణ ఏర్పాటులను పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

అలాగే బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కూడా సమావేశంలో పాల్గొని కార్యక్రమ ఏర్పాట్లకు తన సహకారాన్ని తెలిపారు.

ఈ సమావేశంలో వివిధ బీసీ సంక్షేమ కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వివిధ బీసీ కుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

13 ఆగస్ట్ 2026 గురువారం

## వాయిదాల లోక్‌సభ ? ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్ధులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్ధులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్ధులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సోరేన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు.

# మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే...

**బకాయిల వసూలుకు విధివిధానాల రూపకల్పన**
**ధాన్యం నిల్వకు అయిదు నియోజకవర్గాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలు**
**పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**





హైదరాబాద్: మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల (గాఎ+) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన సీఎం.

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన సీఎం.

### సంగారెడ్డి ప్రమాదం పట్ల టీపీసీసీ సంతాపం..



సంగారెడ్డి జిల్లా సత్వార్ వద్ద జరిగిన ఘోర రోడ్ ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత పడడం పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. ఆటో ను లారీ డి కొన్న ప్రమాదంలో కర్ణాటక వాసులు 6 గురు దుర్మరణం పాలవడం మరో ఆరుగురు తీవ్రంగా గాయపడడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# పేదల సొంతింటి కలకు కేంద్రం చేయూత





మొదటి పేజీ తరువాయి

బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీలు డా. మల్లు రవి, రామసహాయం రఘురామిరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, మండాది అనిల్‌కుమార్ యాదవ్లతో కలిసి మంత్రి పొంగులేటి కలిశారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ అవసరాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం 21 లక్షల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్ ప్లస్--2024 యాప్ ద్వారా ఇంటింటా సర్వే నిర్వహించగా 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించబడ్డాయని చెప్పారు. సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

“అర్హులైన కుటుంబాల జాబితాను రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాం. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని నేను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అనేక దఫాలుగా కేంద్రం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. స్వయంగా ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లోనూ రాష్ట్ర గృహ అవసరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చాను” అని పొంగులేటి తెలిపారు.

తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదల గృహ నిర్మాణం నిలిచిపోవడంతో భారీ డిమాండ్ ఏర్పడిందని, ఈ నేపథ్యంలో అర్హులైన 11,56,915 కుటుంబాలకు ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రాష్ట్ర సాయంPMAY-G కింద కేంద్ర వాటాతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు.

“పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే దాదాపు 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. కేంద్రం నుంచి PMAY-G ఇళ్ల కేటాయింపు జరిగితే గ్రామీణ పేదల సొంతింటి కలను మరింత వేగంగా నెరవేర్చగలం” అని మంత్రి అన్నారు.

తెలంగాణ పర్యటనకు రావాలని ఆహ్వానం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. PMAY-G 2.0 కింద తెలంగాణకు ఇళ్ల కేటాయింపును స్వయంగా రాష్ట్రానికి వచ్చి ప్రకటిస్తే గ్రామీణ పేదలకు మరింత భరోసా కలుగుతుందని తెలిపారు.మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

నెల్లూరు, ఆగస్టు 12,వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృధా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# గ్రంథాలయాలు జ్ఞాన వికాసానికి కేంద్రాలు: గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, ఆగస్టు 12, 2026: గ్రంథాలయాలు జ్ఞానాన్ని అందించడంతోపాటు విద్య, పరిశోధన, మేధో వికాసానికి కీలక కేంద్రాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఆధునిక డిజిటల్ సాంకేతికతను గ్రంథాలయాలు విస్తృతంగా వినియోగించుకోవాలని, అదే సమయంలో గ్రంథాలయాల మౌలిక విలువలు, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన జాతీయ లైబ్రేరియన్స్ ( గ్రంథపాలకుల) దినోత్సవం వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయం లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం, ఢిల్లీ లైబ్రరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భారతదేశంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ డాక్టర్ రంగనాథన్‌కు నివాళులర్పించారు. భారతదేశంలో గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.




ఈ సందర్భంగా 'హ×ూ జుఎబఝ్ఞ్అశీఅ అఅ ాశ్రీఅస్త్రఅఎవత్ ష్త్ప్త చీజూ 2020' అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును గవర్నర్ ప్రారంభించారు. పునరుద్ధరించిన లెక్చర్, సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. జ్ఞాన సమాజ నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర మరింత విస్తరిస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకాలతోపాటు ఈ-లైబ్రరీలు, డిజిటల్ వనరులు, ఆధునిక సమాచార సాంకేతికతను విద్యార్థులు, పరిశోధకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ పుస్తక పఠనం, జ్ఞానాన్వేషణ, గ్రంథాలయ సంస్కృతికి ఉన్న ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని ఆయన అన్నారు.

డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతోపాటు, జాతీయ విద్యా విధానం--2020కు అనుగుణంగా గ్రంథాలయ విద్యను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని గవర్నర్ పిలుపునిచ్చారు.

యువతే దేశ ప్రగతికి చోదకశక్తి :గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల రాష్ట్ర, దేశ యువతకు శుభాకాంక్షలు తెలిపారు.

దేశ ప్రగతికి యువతే చోదకశక్తి అని, భవిష్యత్ భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. యువత పెద్ద కలలు కనాలని, బాధ్యతాయుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ లక్ష్యసాధనతో ముందుకు సాగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ నిజాయితీ, కరుణ, రాజ్యాంగ విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు.

జాతీయ లైబ్రేరియన్స్ ( గ్రంథపాలకుల) దినోత్సవను పురస్కరించుకుని గవర్నర్ గ్రంథపాలకులకు, పుస్తక ప్రేమికులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

## ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి ప్రభుత్వం శ్రీకారం

రేపు ఆగస్టు 13 గురువారం సచివాలయంలో బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ । ఆగస్టు 12, 2026బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం ఈ పథకం ప్రత్యేకత.

ఆగస్టు 13, 2026 గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.కుట్టు వృత్తిపై నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంచి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయాన్ని ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

పథకం విధి విధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ రేపు నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్లడించనున్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ మంత్రులు, బీసీ ఎంపీలు, బీసీ ఎమ్మెల్యేలు, బీసీ ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు.

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ, మహిళలను ఆర్థికంగా శక్తివంతం చేసే దిశగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

# తొట్టెల ఊరేగింపు కార్యక్ర మానికి అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రంగారావు సీనియర్ నాయకులు ఎండి కలీం



**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 12** శేరిలింగంపల్లి నియోజక వర్గం ప్రాంతంలోని హైదర్నగర్ గ్రామంలో బోనాలు నిర్వహించిన రెండవ రోజు బోనాల పండుగను పురస్క రించుకొని ఓల్డ్ విలేజ్ అయిన హైదర్ నగర్ లో మంగళ వారం జరిగిన తొట్టెల ఊరేగింపు కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ రంగారా వు ముఖ్యఅతిథిగా పాల్గొని తొట్టె ల కార్యక్రమాన్ని పరవేక్షించిన అనంతరం గ్రామస్తులతో యువకు లతో తొట్టెల ఊరేగింపు కు భారీ ఎత్తున టిఆర్ఎస్ నాయకులు యువ నాయకులు పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతంగా కొనసా గించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ కలీం భా య్,రామ్ నరేష్ నగర్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, అడ్డు,జమీర్ భాయ్, వెంకటేష్ యాదవ్, నర్సిం గ్ ముదిరాజ్, అబుసర్ తదితరు లు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం..

### వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

### నిర్ధిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి

### వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 ప్రజాబలం:**ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత





అధికారులకు పలు సూచనలు చేశారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఇండ్లు ఇండ్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, స్లాబ్ పనులు, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచంద్ర, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయండి

### టి జే ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్

### అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ కు టి జే ఎఫ్ వినతి

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు12 ప్రజాబలం:**గతంలో మాదిరిగా ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ యధావిధిగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.



జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద, మీడియం, చిన్న పత్రికలు, చానళ్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులుకు జిల్లా కేంద్రాలలో, మున్సిపాలిటీ కేంద్రాలలో ఉన్న రిపోర్టర్లకు కార్డులు తగ్గించటం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం నియోజకవర్గాల ఇన్చార్జిలకు జిల్లా కార్డులు ఇవ్వాలని, వారికి రాష్ట్రస్థాయి బస్సు పాసుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంప్యానల్ ఉన్న కేబుల్ ఛానల్ కు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వివరించారు. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనికి కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డి పి ఆర్ ఓ గౌస్ ను ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె టిజెఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్న బోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందుల ఉపేందర్, హరీష్, మందటి రమణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ రామి శెట్టి విజేత, అడపాల నాగేందర్, శాస్త్రి, ఫోటోగ్రాఫర్ రాజు, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, అమరవరపు కోటేశ్వరరావు, ఎస్వీ రెడ్డి, రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, గోవిందు, రోసి రెడ్డి,ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మాధవి, కిరణ్మయి, పెంటి వెంకటేశ్వర్లు, మోహన్, సాయి, గౌరీ శంకర్, పాశం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తదుపరి దశకు సన్నద్ధం కావాలి..

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా..

## అక్టోబర్ 19న తుది జాబితా

## నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత ధృవపత్రాలను సమర్పించాలి

## ఎస్ఐఆర్‌పై కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం ఏర్పాటు





**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 ప్రజాబలం:**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహకరించిన ప్రజలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎస్.ఐ.ఆర్. తదుపరి దశకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మీడియాతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, అనామలీస్, ఫారాలు తిరిగి సమర్పించని ఓటర్ల వివరాలు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, అవసరమైన ధృవపత్రాల సమర్పణ, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను రెండు పర్యాయాలు పొడిగించిందని తెలిపారు. ప్రస్తుతం తొలి దశ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి దశకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. 10 లక్షల 85 వేల 927 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు (87.31 శాతం) మేర డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ చేయబడలేదని, వీరికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా తగిన ధృవపత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ధృవపత్రాలు అందుబాటులో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి అవసరమైన ధృవ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్.ఐ.ఆర్. డేటాలో 1,32,736 అనామలీస్ గుర్తింపు

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతం అని చెప్పారు. పేర్ల స్పెల్లింగ్‌లో తేడాలు, తల్లిదండ్రులు--పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉండటం తదితర కారణాలతో అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. వీటిని కేవలం డేటాలోని లోపాలుగా పరిగణించకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం అవసరమైన సవరణలు చేపడతామని తెలిపారు. 1,57,854 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు జిల్లాలో 1,57,854 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు. వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామని చెప్పారు. క్షేత్రస్థాయి విచారణలో 33,380 మంది మరణించిన ఓటర్లు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1,01,000 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

మరో సుమారు 11 వేల మంది వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించలేకపోయారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన లో తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం

ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు మరో అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతంలో తనకు ఓటు హక్కు లేదని ప్రకటిస్తూ అవసరమైన డిక్లరేషన్‌తో పాటు సంబంధిత వివరాలు, ధృవపత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పౌరులు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పుట్టిన తేదీకి అనుగుణంగా ఎన్నికల సంఘం సూచించిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఆధారాలను సమర్పించాలి

ఎన్యూమరేషన్ ఫారంలో ఓటరు గత ఎస్ఐఆర్ ఓటరు జాబితా వివరాలు అందుబాటులో లేకపోవడం లేదా డేటాబేస్‌లో ఉన్న వివరాలతో సరిపోలక పోవడం వంటి సందర్భాల్లో సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ, పుట్టిన ప్రదేశాన్ని నిర్ధారించే ఆధారాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈఆర్ఓ సంబంధిత ఆధారాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

జనన తేదీ ఆధారంగా ధృవపత్రాల సమర్పణ

భారతదేశంలో 1987జులై 1కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు నిర్ధారించే ధృవ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 1987 జులై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒకరి ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవ పత్రాలలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.

క్లెయిమ్స్, అభ్యంతరాలపై విచారణ అనంతరం నిర్ణయం

ఎన్యూమరేషన్ వివరాలపై వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈఆర్ఓలు నోటీసులు జారీ చేసి, సంబంధిత ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఈఆర్ఓలు తీసుకున్న నిర్ణయంపై నిబంధనల ప్రకారం అక్టోబర్ 15 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా సహకరించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా వాస్తవ సమాచారాన్ని విస్తృతంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, మరణించిన, శాశ్వతంగా తరలివెళ్లిన, డబుల్ నమోదైన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం పాత్రికేయులు ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, అనామలీస్, ఓటర్ల వివరాల పరిశీలన, ధృవపత్రాల సమర్పణ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, తదితర అంశాలపై అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమాధానాలు ఇచ్చారు.

ఈ మీడియా సమావేశంలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ క్షేత్రస్థాయి పరిశీలన

### విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు

**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి 12 ఆగస్టు:** ములుగు జిల్లా పర్యటనలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 16వ



తేదీన పర్యటించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ములుగు డివిజన్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ ములుగుతో పాటు, గట్టమ్మ సబ్‌స్టేషన్ ను సీఎండీ పరిశీలించి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన విద్యుత్ ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎండీ ఆదేశించారు. విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా సిబ్బంది, వాహనాలు, అవసరమైన విద్యుత్ సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ పరిసరాల్లో జరుగుతున్న విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించిన సీఎండీ, ముఖ్యమంత్రి కార్యక్రమాలు జరిగే ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గట్టమ్మ సబ్‌స్టేషన్‌లో కూడా విద్యుత్ సరఫరా ను పరిశీలించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, "గౌరవ ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లాలో విద్యుత్ సరఫరాకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలి. కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ములుగు దీ. బిక్షపతి, డి.ఈ ములుగు కన్నా రాజు, డి.ఈ వీ౼ సదానందం, ఈ ఈ సివిల్ వెంకట్ రాం, ఏడీఈ ములుగు చీ. వేణుగోపాల్ పాటు ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆయూష్ హౌస్ సర్జన్ల నిరసన నినాదాలు చేస్తున్న హౌస్ సర్జన్లు, వైద్య విద్యార్థులు

అల్లోపతి వైద్యసర్జన్లతో సమానంగా తమకు ప్రభుత్వం ఉపకార వేతనాన్ని పెంచాలని ఆయూష్ హౌస్ సర్జన్లు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆయూష్ హౌస్ సర్జన్లు, పీజీ స్కాలర్ల జేఏసీ పిలుపు మేరకు బల్కంపేటలోని కొణి జేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయంలో పని చేస్తున్న హౌస్ సర్జన్లు గత తొమ్మిది రోజులు నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వీరికి ప్రస్తుతం ప్రకృతి వైద్య అభ్యసి స్తున్న విద్యార్థులు మద్దతు పలికారు. తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి తమకు ఉపకార వేత నాన్ని పెంచలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆయూష్ జూనియర్ వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపకార వేతనాన్ని పెంచే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలి.

### నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి పరిసరాలను ఆకర్షణీయంగా సుందరీకరించాలి.

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ప్రజా బలం ప్రతినిధి ములుగు జిల్లా 12 ఆగస్టు:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన ములుగు జిల్లా పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను నిర్దేశిత



గడువులోగా వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పరిసరాలను ఆకర్షణీయంగా సుందరీకరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హెలిప్యాడ్‌ను, గట్టమ్మ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ నిర్మాణం పనులను పరిశీలించి, గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ హెలిప్యాడ్ వద్ద చేపడుతున్న బారికేడింగ్, వీవీఐపీ వేచి ఉండే టెంట్, భద్రతా ఏర్పాట్లతో పాటు పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పైలాన్ నిర్మాణంతో పాటు ఇతర పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆకర్షణీయంగా సుందరీకరించాలని ఆదేశించారు. గట్టమ్మ దేవాలయ పరిసరాల పరిశుభ్రత, సుందరీకరణ, వాహనాల పార్కింగ్ స్థలాలు, భద్రత తదితర అంశాలను సమీక్షించి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న పైలాన్ పనుల పురోగతిని పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం, స్టేట్ బోర్డ్ ఛాంబర్, జిల్లా కలెక్టర్ ఛాంబర్ తో పాటు వివిధ కార్యాలయ గదులను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, డీఎస్పీ రవీందర్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ములుగు తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 12:**ఖరీఫ్ 2026--27 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం అదనపు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీమతి ఎల్. సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.డి. రియాజ్ తదితర అధికారులతో ఖరీఫ్ 2026--27 ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోళ్లకు అవసరమైన మేరకు గన్నీ సంచులను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

రైతులు తమ ధాన్యాన్ని తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరిచి, పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని, ధాన్యం క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం కావడం వల్ల రైతుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నందున, ప్రతి ధాన్యం కొనుగోలు ఎంట్రీని అదే రోజు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో నిరంతర సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించిన అనంతరం 48 గంటల్లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లాకు మరియు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అదనపు జిల్లా కలెక్టర్ సూచించారు.

# కస్టమ్ మిల్లింగ్ (లెవీ)లో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు ,రైస్ మిల్లుల్లో తనిఖీ లు



జనగామ ఆగస్ట్ 12; కస్టమ్ మిల్లింగ్ (లెవీ)లో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని,చట్ట పరంగా తగు చర్యలకు సిఫారసు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు.బుధవారం నాడు ఆయన జనగామ జిల్లా లింగాల ఘనపురం లో మణికంఠ ఆగ్రో ఇండస్ట్రీస్ ను స్థానిక తాసిల్దార్ తో కలిసి తనిఖీ చేశారు.మిల్లు లో ఎంత ధాన్యం మిగిలి ఉంది అనే విషయం లో లోతుగా విచారణ జరిపారు. తదనంతరం

సంయుక్త పంచానామా నిర్వహించారు.

ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..లెవీ లో.. అక్రమాలు జరిగితే అరెస్టులు తధ్యం అని రఘునందన్ స్పష్టం చేశారు.

# ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు పలువురికి గాయాలు

జంగారెడ్డిగూడెం లక్కవరం సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పై హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్ ఆగి ఉన్న ఆగి ఉన్న లారీ ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిని వారిని ఆసుపతరికి తరలించారు.

# జనసేనకు మరో మంత్రి పదవి..?

విశాఖపట్టణం, ఆగస్టు 12, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే ఒకేసారి కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం త్వరలోనే ఏపీ క్యాబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు అమరావతి వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ఈ ప్రక్షాళనలో భాగంగా భాగస్వామ్య పక్షమైన జనసేన పార్టీకి మరో అదనపు మంత్రి పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జనసేన నుంచి క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా కొనసాగుతుండగా.. ఇప్పుడు నాలుగో బెర్త్ ఎవరికి దక్కుతుందనే అంశంపై కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.ఈసారి దక్కబోయే అదనపు మంత్రి పదవిని ఉత్తరాంధ్ర రీజియన్‌కు కేటాయించాలని కూటమి పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. జనసేన కోటాలో రాబోయే ఈ కొత్త పదవితో ఉత్తరాంధ్రకు లభించనున్న నాలుగో మంత్రి పదవిగా ఇది నిలవనుంది. ముఖ్యంగా ఈ మంత్రి పదవి రేసులో బీసీ వర్గాలకు పెద్దపీట వేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మంత్రి పదవి రేసులో ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు అనకాపల్లి నుంచి గెలిచిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ కాగా.. మరొకరు విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్. అయితే, ఉత్తరాంధ్రలో అత్యంత బలమైన సామాజికవర్గంగా ఉన్న గవర వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఆ వర్గానికి చెందిన సీనియర్ లీడర్ కొణతాల రామకృష్ణకే మంత్రి పదవి దక్కే అవకాశాలు అత్యధికంగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.ఆయనకున్న రాజకీయ అనుభవం, సీనియారిటీ కూడా దీనికి ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేరు కూడా గట్టిగా పరిశీలనలో ఉన్నప్పటికీ, సామాజిక సమీకరణాలు మరియు ప్రాంతీయ బలోపేత వ్యూహాల ప్రకారం కొణతాల రామకృష్ణ వైపే అధిష్ఠానం మొగ్గు చూపవచ్చని అంటున్నారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభంలో జరగబోయే క్యాబినెట్ విస్తరణపై త్వరలోనే అధికారికంగా పూర్తి స్పష్టత రానుంది.


# నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

విజయవాడ, ఆగస్టు 12, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ - నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు.అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ - నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్-మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ - నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**వైసీపీ వ్యూహం ఏమిటీ...**

అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

## రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..



హైదరాబాద్, ఆగస్టు 12, రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# డీఎస్సీ-2026 ప్రక్రియ అక్టోబర్ నెలలో ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనేది లక్షల మంది యువత కల. రాష్ట్ర విద్యావ్యవస్థలో కీలక మార్పులు తీసుకొస్తున్న ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమైంది. గత ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా భారీగా పోస్టులను భర్తీ చేసింది. ఇప్పుడు మరోసారి అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసేందుకు రెడీ అవుతోంది. అభ్యర్థులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, మంత్రి నారా లోకేష్ వెల్లడించిన వివరాలు ప్రకారం, రాబోయే డీఎస్సీ-2026 ప్రక్రియ అక్టోబర్ నెలలో ప్రారంభంకానుంది. అక్టోబర్‌లో అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలవుతుంది. అభ్యర్థులకు ప్రిపరేషన్ కోసం తగిన సమయం ఇస్తూ, డిసెంబర్ నెలలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ స్పష్టమైన కాలపరిమితి అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను ప్రణాళికాబద్ధంగా మార్చుకోవడానికి ఎంతో దోహదపడుతుంది. రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తిని మెరుగుపరచడం ఈ నోటిఫికేషన్ ప్రధాన ఉద్దేశం. మెగా డీఎస్సీ-2025 ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఇంకా మిగిలిన ఉన్న ఖాళీలను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ మీడియాలో నియామక ప్రక్రియపై వస్తున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడానికి, అభ్యర్థుల్లో భరోసా కల్పించడానికి ఈ కొత్త నోటిఫికేషన్ ప్రకటన ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల అమలులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ప్రతి దశలోనూ పారదర్శకత పాటిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఈసారి అంతే పారదర్శకతతో ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. డీఎస్సీ 2026 సిలబస్ రాబోయే డీఎస్సీ పరీక్షల కోసం విద్యాశాఖ సజెస్టివ్ సిలబస్‌ను ఇప్పటికే రూపొందించింది. 2025-26 విద్యా సంవత్సరం సిలబస్‌ను అభ్యర్థులు అనుసరించాల్సి ఉంటుంది. ఎస్జీటీ- ఎస్జీటీ పోస్టులకు మొత్తం 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్ & కరెంట్ అఫైర్స్(8 మార్కులు), పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్(4 మార్కులు), ఎడ్యుకేషనల్ సైకాలజీ (8మార్కులు) కంటెంట్ అండ్ మెథడాలజీ(60 మార్కులు) ఉంటాయి. స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ):- స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు జీకే (10 మార్కులు), పర్స్పెక్టివ్స్(5 మార్కులు), సైకాలజీ(5 మార్కులు), సబ్జెక్ట్ కంటెంట్(40 మార్కులు)తోపాటు మెథడాలజీ(20 మార్కులు)కీలక భూమిక పోషిస్తాయి. భాషా అంశాలు: తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, కన్నడ, ఒడియా, తమిళం, సంస్కృతం వంటి భాషలకు సంబంధించి 3 నుంచి 10వ తరగతి స్థాయి వరకు ఉన్న సాహిత్యం, వ్యాకరణం, బోధన పద్ధతులపై ప్రశ్నలు వస్తాయి. బోధనేతర సబ్జెక్టులు: గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో ఇంటర్మీడియట్ స్థాయి వరకు లోతైన జ్ఞానాన్ని కలిగి ఉండాలి. పర్స్పెక్టివ్ అండ్ సైకాలజీ: డీఎస్సీలో కేవలం సబ్జెక్ట్ నాలెడ్జ్ మాత్రమే కాకుండా, ఒక ఉపాధ్యాయుడికి ఉండాల్సిన సామాజిక స్పృహ, మానసిక శాస్త్ర అవగాహన కూడా పరీక్షిస్తారు. పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ విభాగంలో భారతీయ విద్యా చరిత్ర, ఉపాధ్యాయ సాధికారత, సమకాలీన విద్యా ధోరణులు, ఎడ్యుకేషనల్ యాక్ట్స్, జాతీయ విద్యా విధానం 2020 వంటి అంశాలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. అదే విధంగా ఎడ్యుకేషనల్ సైకాలజీలో శిశు వికాసం, అభ్యసనం, వ్యక్తిత్వం వంటి అంశాల ద్వారా విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు దివ్యాంగులైన విద్యార్థులకు బోధించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు అవసరం. దీని కోసం డీఎస్సీలో ప్రత్యేకంగా ఎస్జీటీ, టీజీటీ విభాగాల్లో పోస్టులు భర్తీ చేస్తారు. వినికిడి లోపం, దృష్టి లోపం కలిగిన విద్యార్థులకు బోధించే మెళకువలు, వారి కోసం ప్రత్యేక సిలబస్, ఆర్సీఐ నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహిస్తారు. నోటిఫికేషన్ రాక ముందే అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను ప్రారంభించడం మంచిది. సోషల్ మీడియాలో వచ్చే చర్చలు, అపోహలను పట్టించుకోకుండా ప్రిపరేషన్‌పై ఫోకస్ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదవడంతోపాటు, పాత ప్రశ్నా పత్రాలను విశ్లేషించుకోవడం వల్ల మంచి మార్కులు సాధించే ఛాన్స్ ఉందని అంటున్నారు.

# ఈ కేవైసీ కోసం ఆగస్టు 31లోపు డెడ్ లైన్.

హైదరాబాద్, ఆగస్టు 12, దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే ఈ కేవైసీ కోసం ప్రత్యేకంగా కేంద్రాలకు వెళ్లకుండా ఇంట్లోనే మొబైల్ ద్వారా కూడా పూర్తి చేయొచ్చు. గ్యాస్ కనెక్షన్లు నిజమైన లబ్ధిదారుల పేర్లలోనే కొనసాగుతున్నాయా..? లేదా అనే విషయాన్ని నిర్ధారించడం కోసమే ఈ ఈ కేవైసీ. ఒకే వ్యక్తి పేరుతో ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండటం.. తప్పుడు వివరాలతో కనెక్షన్లు తీసుకోవడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధ్రువీకరణను చేపడుతున్నాయి. దీంతో అర్హులైన వినియోగదారులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేవైసీ పూర్తి చేయడానికి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలంటే కొందరికి ఇబ్బందులు ఉంటాయి. దీంతో ఆ అవసరం లేకుండా ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా దీనిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం మీరు ఏ కంపెనీ గ్యాస్ కనెక్షన్ ఉపయోగిస్తున్నారో దానికి అనుగుణంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా ఆ కంపెనీ వెబ్ సైట్ నుంచి కూడా ఈ ప్రక్రియను చేయొచ్చు.ముందుగా గ్యాస్ కంపెనీ యాప్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ప్రొఫైల్ లేదా మై అకౌంట్ విభాగంలోకి వెళ్లి 'ఈకేవైసీ లేదా ఈ వెరిఫికేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు కోసం ఆధార్ ఫేస్ ఆర్ డీ యాప్ ఓపెన్ అవుతుంది. ముఖంపై సరిపడా వెలుతురు ఉండేలా చూసుకుని కెమెరా ద్వారా ఫేస్ స్కాన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ విజయవంతమైతే ఈ కేవైసీ పూర్తయినట్లు స్క్రీన్‌పై సమాచారం కనిపించడంతో పాటు కన్ఫర్మేషన్ మెసేజ్ కూడా వస్తుంది ఫేస్ స్కాన్ చేసే సమయంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఉండాలి. కళ్లద్దాలు, మాస్క్, టోపీ వంటివి తొలగించడం మంచిది. ఇంటర్నెట్ కనెక్షన్ బాగా ఉండాలి. అలాగే ఆధార్‌లో నమోదైన వ్యక్తే స్కాన్ చేయాలి. లేదంటే ధృవీకరణ విఫలమయ్యే అవకాశం ఉంటుంది. చాలా మంది ఒకేసారి ఈ కేవైసీ చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై ఒత్తిడి పెరిగి యాప్ నెమ్మదిగా పనిచేసే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం తొందరగా లేదా రాత్రి సమయంలో ఈ కేవైసీ ప్రయత్నిస్తే ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వినియోగదారులకు చెబుతున్నారు.

# గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు

హైదరాబాద్, ఆగస్టు 12, తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్ , నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది.ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి.మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్ఓల ద్వారా ఫారమ్-6, ఫారమ్-8 దాఖలు చేసి రీ-ఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

# నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు...

హైదరాబాద్, ఆగస్టు 12 హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈ-వేలంలో ఉంచారు. హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరోక భారీ ఈ-వేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి అధికారులు నోటిఫికేషన్ సిద్ధం చేశారు. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది.అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలిస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈ-వేలం జరగనుంది.ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్ఎండీఏ అమ్మకానికి ఉంచింది. కూకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బోరాంగూడ, చందానగర్, సూరారం, కావ్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు.ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు

# అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్!

హైదరాబాద్, ఆగస్టు 12,లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే.హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

# ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

హైదరాబాద్, ఆగస్టు 12, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

## వరికి బీమా గడువు ఇక మూడు రోజులే!

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15తో ముగియనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవటానికి ఇదే చివరి అవకాశం. గడువు లోగా బీమా ప్రీమియం చెల్లిస్తే.. ఈ-పంట నమోదు వివరాలను తర్వాతైనా చేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ తెలిపింది. ముందస్తు పంటల బీమాకు ఈ-పంట నమోదు అవసరం లేదని స్పష్టం చేసింది. కేవలం పంట సాగుపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, గడువులోగా బీమా ప్రీమియం చెల్లిస్తే చాలని పేర్కొంది.

# మెయినాబాద్ లో 200 కోట్లతో పూలు, కూరగాయలు మార్కెట్

హైదరాబాద్, ఆగస్టు 12 హైదరాబాద్ శివారులో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లో మొత్తం 39.07 ఎకరాలను మార్కెటింగ్ శాఖకు కేటాయించింది. మార్కెట్‌లో శీతల గిడ్డంగులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, భారీ భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంగా ఉండటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల రవాణా, దేశీయ, విదేశీ ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు, పూలు కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో 39.07 ఎకరాల భూమిని కేటాయించారు. మార్కెట్ నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 176/పిలో 23.22 ఎకరాలు, హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 151/పిలో 15.25 ఎకరాలు కలిపి మొత్తం 39.07 ఎకరాలను రెవెన్యూ శాఖ మార్కెటింగ్ శాఖకు బదలాయించింది. భూమి బదలాయింపు పూర్తవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనపై కసరత్తు ప్రారంభించారు. మార్కెట్ నిర్మాణం, విస్తీర్ణం, మౌలిక వసతులు, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలు తదితర అంశాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు. దేశంలో పూల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన బెంగళూరులోని కృష్ణరాజేంద్ర మార్కెట్‌ను అధికారులు ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సమాచారం. అక్కడి మార్కెట్ పనితీరును పరిశీలించిన అధికారులు.. దానికంటే పెద్దదిగా, ఆధునిక సదుపాయాలతో హైదరాబాద్ మార్కెట్‌ను తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించారు. ప్రతిపాదిత మార్కెట్‌లో భారీ మార్కెట్ భవనాలు, ప్రత్యేక విక్రయ వేదికలు, లోడింగ్? అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా తరలించేందుకు అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండటం వల్ల నాణ్యమైన పూలు, త్వరగా పాడయ్యే కూరగాయలను దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు విదేశీ మార్కెట్లకు కూడా తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో పూలకు ప్రత్యేకంగా పెద్ద మార్కెట్ లేకపోవడంతో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కూరగాయలతోపాటు పూల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటైతే వేలం, ధర నిర్ణయం, నిల్వ, రవాణా వంటి వ్యవస్థలు ఒకే చోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు మార్కెట్ సమాచారం, మెరుగైన ధరలు లభించడంతోపాటు పంట నష్టాలు తగ్గే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 4,402 ఎకరాల్లో వివిధ రకాల పూలు, 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో దాదాపు 60 శాతం సాగు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనే జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. నగరానికి సమీపంలోనే భారీ వినియోగ మార్కెట్ ఉండటం రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తగిన మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలో ప్రతిపాదిత మార్కెట్ పూర్తయితే పూలు, కూరగాయల రైతులకు కొత్త మార్కెట్ వేదికగా మారనుంది. ఉత్పత్తిదారులు, వ్యాపారులు, హోల్‌సేల్ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో మార్కెటింగ్ వ్యవస్థ మరింత వ్యవస్థీకృతమయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, హైదరాబాద్ నగరానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలకు ఈ మార్కెట్ కీలకంగా మారనుంది.

# 4వ సారి కూడా ఆడపిల్ల పుట్టిందని ఆత్మహత్య చేసుకున్న బాలింత



నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదం మునుగోడు మండలం చీకటి మామిడి గ్రామానికి చెందిన బాలింత మమత ఆసుపత్రి ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. వారం రోజుల క్రితమే ఆమెకు ప్రసవం జరగగా వరుసగా మళ్ళీ ఆడపిల్లలు పుట్టడంతో కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని బంధువులు తెలిపారు. అత్తింటి వేధింపులే మమత మృతికి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన



హైదరాబాద్ రాయదుర్గంలో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ ప్రాజెక్టు టెండర్లలో భారీ కుంభకోణం మరియు ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆ టెండర్లను రద్దు చేయాలని బీఆర్ఎస్ (ఖీఠ) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు.... ఈ రోజు రాయదుర్గం భూముల వద్ద ఆందోళన చేపట్టిన దాసోజు శ్రవణ్, శంబీపూర్ రాజు.. బీఆర్ఎస్ శ్రేణులు.. రాయదుర్గంలోని అత్యంత విలువైన 6.30 ఎకరాల ప్రభుత్వ భూమి లో మొత్తం సుమారు 27 లక్షల చదరపు అడుగుల నిర్మాణం జరుపుటకు నిర్ణయం.. అంచనా వ్యయం: భూమి విలువ కాకుండా దాదాపు రూ. 2,059.81 కోట్లు.కేంద్ర సహాయం: కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ. 202 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది...బీఆర్ఎస్ ప్రధాన అభ్యంతరాలు ఒ ఆరోపణలుఈ ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే బిల్ట్-అప్ ఏరియా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేట్ డెవలపర్‌కు ఏకంగా 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని (ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు) కేటాయించడంపై బీఆర్ ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు...పీపీపీ (ఖఖఖ) మోడల్‌లో టెండర్ నిబంధనలను ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మార్చేసిందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో లీజు ప్రాతిపదికన ఇస్తుంటే, ఇక్కడ ఏకంగా అమ్ముకునే వెసులుబాటు ఇచ్చారని విమర్శించారు...కేంద్ర నిధుల దారి మళ్లింపు: కేంద్రం ఇచ్చే రూ. 200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఒఱుఖ) ద్వారా నేరుగా ప్రైవేట్ డెవలపర్‌కు బదిలీ చేసేందుకు నిబంధనలు రూపొందించారని, ఇది కేంద్ర పథక నియమాలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం: ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ, సర్వేలు, మరియు అనుమతుల పేరుతో ఇప్పటికే చేసిన ఖర్చులను కేంద్ర నిధుల నుండి సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించడాన్ని తప్పుబట్టారు..ల్యాండ్ ఇష్యూ (భూ వివాదం ఒ కూల్చివేతలు)ఈ యూనిటీ మాల్ నిర్మాణ స్థలానికి సంబంధించి గతంలో (2024 ఆగస్టులో) పెద్ద వివాదం నడిచింది. మాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఉన్న కొన్ని నిర్మాణాలను అక్రమ కట్టడాలంటూ అధికారులు జీహెచ్ఎంసీ (ఉఊఓఅ) సాయంతో కూల్చివేశారు. అయితే, ఈ భూమి తమ సొంత పట్టా భూమి అని, ఇన్యామ్ రద్దు చట్టం కింద దీనిపై స్పష్టత లేదని 'హైదరాబాద్ టానరీస్' అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేశారని బాధితులు ఆందోళన చేశారు...బీఆర్ఎస్ డిమాండ్లు:కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో, ఈ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కాగ్ (అంఆ) లేదా ఇతర స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించే వరకు కేంద్ర నిధుల విడుదలను నిలిపివేయాలని కోరారు.

# సెంట్రల్ యూనివర్సిటీలో ఈగల్ టీం దాడులు 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్

హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఊఅఆ) క్యాంపస్లో తెలంగాణ ఈగల్ (ఇంఒఒ) టీమ్ మరియు సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసారు. యూనివర్సిటీ పరిధిలో డ్రగ్స్ విక్రయాలు, వాడకం జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో ఈగల్ టీమ్ తనిఖీలు చేపట్టింది. 17 మందికి పాజిటివ్ అనుమానం ఉన్న విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ప్రధాన నిందితుడి అరెస్ట్ విద్యార్థులకు అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు అస్సాం రాష్ట్రం నుండి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది క్యాంపస్లో ఒక్కో గ్రాము గంజాయిని సుమారు 500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు, నిందితుల సమాచారం పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా వెలువడాల్సి ఉంది.

## పోలీసులపై దౌర్జన్యం.. కత్తితో పొడుస్తానంటూ బెదిరింపులు... శ్రీకాళహస్తిలో కలకలం

విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై యువకులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన శ్రీకాళహస్తిలో ఉద్రిక్తతకు దారితీసింది. రైల్వే స్టేషన్‌లో జరిగిన సెల్‌ఫోన్ చోరీపై విచారణకు వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రమణయ్యకు మార్గమధ్యంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన కనిపించింది. క్షతగాత్రులను చూసిన రమణయ్య వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి గురైన వాహనాల తాళాలు తీసుకుని పోలీస్ స్టేషన్‌కు రావాలని యువకులకు సూచించగా.. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. మాటామాటా పెరగడంతో హెడ్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు "కత్తితో పొడుస్తానంటూ" బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## ఈడేపల్లిలో ఆక్సిజన్ సిలిండర్ లీకేజ్.. రెండు బైక్‌లు, కారు ధ్వంసం

మచిలీపట్నం ఈడేపల్లిలో బెల్ కంపెనీ వెనుక ప్రాంతంలో బుధవారం ఆక్సిజన్ సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా కలకలం రేగింది. లీకేజీ కారణంగా సిలిండర్ అదుపుతప్పి సమీపంలోని ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది లీకేజీని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. సిలిండర్ లీకేజీతో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఎరగేరి హై స్కూల్ విద్యార్థుల ఘన విజయం

కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎరగేరి విద్యార్థులు డిసెంబర్ 2025లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.రజిత,యు.నిఖిల్, ఎం.అజయ్ ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ లభిస్తుంది. ఈ విజయం విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి మరియు తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల విజయానికి ప్రత్యేకంగా కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మరియు సైన్స్ ఉపాధ్యాయులు అదేవిధంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుసహకరించినఇతరఉపాధ్యాయులను,విద్యార్థులతల్లిదండ్రులనుపాఠశాలప్రధానోపాధ్యాయులుబి.రమేష్‌నాయుడు అభినందించారు.

## ప్రియదర్శిని కాలనీలో అర్ధరాత్రి బైక్ దగ్ధం



విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్ ప్రియదర్శిని కాలనీలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో బైక్ దగ్ధం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఇటీవల రౌడీషీటర్ల ఆగడాలు పెరుగుతున్నాయని, వారి కారణంగా రాత్రి వేళల్లో అటువైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డుపై వెళ్తున్న విద్యార్థినులు సైతం బయపడుతున్నారు.... రోడ్డుకు అడ్డంగా నిలబడి దారి లేకుండా చేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు... ఈ ఘటనకు రౌడీషీటర్లే కారణమై ఉండొచ్చన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే బైక్‌కు నిప్పంటించిన వ్యక్తులు ఎవరు, ఘటనకు గల కారణాలేమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. బైక్ దగ్ధం ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి, పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచి, ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఐస్ క్రీమ్ గోదాం లో అగ్ని ప్రమాదం

కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవరయాంజాల్ స్నో రిచ్(ఐస్ క్రీమ్,చికెన్,చాకోలెట్స్)గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. గోదాంలో మంటలు ఒక్కసారిగాచెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు. దట్టమైన పొగలు అలుముకోవడంతో భయాందోళనలో పరిసర ప్రాంత ప్రజలు వుండిపోయారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సిన ఉంది.

## అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్య

నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయకనగర్ లో అప్పుల బాధ తాళలేక నరేష్, మేఘన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రుల మృతితో వారి ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మారగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు భర్త నరేష్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, భార్య మేఘన నిద్రమాత్రలు మింగి తాగి ఆత్మహత్య చేసుకుంది. మేఘన, నరేష్ కు 8 ఏళ్ల కొడుకు, 6 ఏళ్ల బాబు వున్నారు. ఇద్దరు పిల్లలను మేనత్త వద్ద వదిలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య కు పాల్పడ్డారు. పక్క ప్లానింగ్ తో చనిపోదాం అని భార్యాభర్తలు చేసుకున్నట్లు అనుమానం. బంధువులు అప్పుల బాధనే ఆత్మహత్యకు గల కారణాలు అంటున్నారు. భర్త నరేష్ కరెంట్ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహిస్తున్నాడు.

## గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

**(సీహెచ్. ప్రతాప్)**

ఖమ్మం జిల్లా కొనిజర్లలో ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందిన 14 ఏళ్ల ఎనిమిదో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలోని లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి పరిస్థితి విషమించడంతో బాలిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉన్నప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత, దూరంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, అత్యవసర సమయంలో రవాణా సౌకర్యాల లేమి ప్రజలను స్థానికంగా అందుబాటులో ఉండే ఆర్ఎంపీలు, ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించేలా చేస్తున్నాయి. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలు అవసరమే. అయితే ఎవరు ఏ స్థాయి వైద్యం అందించాలి, ఏ మందులు లేదా ఇంజెక్షన్లు ఇవ్వాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికి తరలించాలి అన్నదానిపై స్పష్టమైన నియంత్రణ ఉండాలి.

ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా ఆరోగ్య ఉపకేంద్రాలు సమర్థంగా పనిచేసేలా చేయడం అత్యవసరం. వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ప్రాథమిక అత్యవసర చికిత్స, ఆక్సిజన్ సదుపాయం, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండాలి. అనుమతులు లేని వైద్య కేంద్రాలు, నకిలీ వైద్యులు, అర్హతలకు మించి చికిత్స చేసే వ్యక్తులపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి.

అంతేకాదు, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను కేవలం ఆసుపత్రులకే పరిమితం చేయకూడదు. మంచి రహదారులు, అంబులెన్స్ సేవలు, రవాణా, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, డిజిటల్ వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు కూడా ఆరోగ్య భద్రతలో భాగమే. అత్యవసర సమయంలో రోగిని సమీపంలోని మెరుగైన ఆసుపత్రికి త్వరగా తరలించే వ్యవస్థ ప్రాణాలను కాపాడగలదు.

ప్రతి గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఇంజెక్షన్ లేదా మందులు తీసుకునే ముందు వైద్యుని అర్హతలను నిర్ధారించుకోవడం, తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లడం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక బాలిక ప్రాణం తిరిగి రాదు. కానీ ఆమె మరణం నుంచి పాఠం నేర్చుకుని గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తే, భవిష్యత్తులో మరెన్నో ప్రాణాలను కాపాడవచ్చు. గ్రామీణ భారతదేశానికి మౌలిక సదుపాయాలు అంటే కేవలం రహదారులు, భవనాలు కాదు---ప్రతి పౌరుడికి సురక్షితమైన వైద్యం అందుబాటులో ఉండటమే నిజమైన అభివృద్ధి.

## పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టూరిజం ఎండీ పట్టన్ శెట్టి రవి సుభాష్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి పట్టన్ శెట్టి రవి సుభాష్ సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై వారిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. బాధ్యతలు చేపట్టిన నూతన ఎండీకి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందంజలో నిలిపేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ భేటీలో భాగంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేయాలని దిశానిర్దేశం చేసారు. అదే విధంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఎకో-టూరిజం, ఆరోగ్యం-ఆహ్లాదాన్ని అందించే వెల్ నెస్ టూరిజం ప్రాజెక్టులకు పెద్దపీట వేయాలన్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఇప్పటివరకు కుదుర్చుకున్న ఒప్పందాలు త్వరగా పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ, దాని అనుబంధ విధానాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, పర్యాటక రంగ నిపుణులు, ఇన్వెస్టర్ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ పరిధిలో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా ప్రాంతీయ పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలని, దేశ విదేశాల్లో ఏపీ టూరిజంకు విస్తృత ప్రచారం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం మేరకు రాష్ట్ర పర్యాటక రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని ఏపీటీడీసీ ఎండీ పట్టన్ శెట్టి రవి సుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నీట్‌లో 23 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు

### ఎంఎస్ నీట్ అకాడమీ విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ అభినందనలు

**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఆగస్టు 12, 2026-ఆదిలాబాద్ రీ-నీట్--2026 ఫలితాల్లో ఆదిలాబాద్‌కు చెందిన ఎంఎస్ నీట్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి 23 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా విజేతలను ఘనంగా సన్మానించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అకాడమీ యాజమాన్యాన్ని అభినందించారు. వైద్య విద్యలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు తమ విజయానికి దోహదపడిన అంశాలను కలెక్టర్‌తో పంచుకున్నారు.




అకాడమీ విద్యార్థుల్లో సాదియా సనోబర్ 517 మార్కులతో ఆల్ ఇండియా ర్యాంక్ 68,909 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. అన్నరాహ్ ఫాతిమా 505 మార్కులతో 80,204వ ర్యాంక్, ఉరూబా మహేవిష్ 485 మార్కులతో 1,10,136వ ర్యాంక్, అలీజా నాజ్ 477 మార్కులతో 1,22,033వ ర్యాంక్ సాధించారు. అలాగే మొహమ్మద్ షకీబ్ (461), ఫైజా మహేవిష్ (457), జోహా అన్వర్ ఖానమ్ (456), సుమయ్యా ఫాతిమా (451), అలీనా మహేవిష్ (446), లుక్మాన్ అహ్మద్ (446) తదితరులు కూడా ఉత్తమ మార్కులతో ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకున్నారు.

విజేతలకు కలెక్టర్ జ్ఞాపికలు, అభినందన పత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రోహిత్, స్థానిక నాయకులు సాజిద్ ఖాన్, యూనుస్ అక్బానీ, సయ్యద్ సాజిదుద్దీన్, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

## డా. బూర నర్సయ్య గౌడ్




రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 12;।రంగారెడ్డి జిల్లా ।బ్రహీంపట్నం నియోజకవర్గంఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ఒక పాఠశాల విద్యార్థి విద్యార్థినులతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు నిర్వహించిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని తిరంగా ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి, దేశభక్తికి ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

దేశ సమైక్యత, సార్వభౌమత్వం, అఖండతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. యువతలో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్ , బిజెపి రాష్ట్ర నాయకులు నాయని సత్యనారాయణ , ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ పొట్టి శ్రీరాములు ,ఇబ్రహీంపట్నంమున్సిపాలిటీ,అధ్యక్షులు ముత్యాల మహేందర్ రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ కౌన్సిల్ సభ్యులు ఆడెపు.రాఘవేంద్ర స్వామి , ఇబ్రహీంపట్నం మండల మాజీ అధ్యక్షులు దండే శ్రీశైలం , యువ మోర్చా జిల్లా నాయకులు సిద్ధం శివకుమార్ , బిజెపి సీనియర్ నాయకులు గణేష్ , ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ యువమోర్చా అధ్యక్షులు కంబాలపల్లి శశిధర్ రెడ్డి , మున్సిపాలిటీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు దాసు, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు కొండ్రు శ్రీనివాస్, మున్సిపాలిటీ కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వాపురం గోవర్ధన్, మున్సిపాలిటీ యువమోర్చా నాయకులు మడుపోజు.భరత్ చారి బిజెపి నాయకులు గొట్టం శ్రీశైలం ,బీజేపీ నాయకులు సురేష్ , కృష్ణ మరియు కార్యకర్తలు, ప్రజలు, యువత, మహిళలు, స్కూల్ విద్యార్థులు,పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# తెలంగాణలో ముగిసిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ

**73 లక్షల ఓటర్ల తొలగింపు**

**9,22,230 చనిపోయినవారు**

**11,25,546 ఆబ్సెంట్/అన్ ట్రాసెబుల్,**

**45,18,961 పర్మనెంట్లీ షిఫ్టెడ్**

**6,70,203 ఆల్రెడీ ఎన్రోల్డ్**

**1.02.294 అదర్స్ , 63లక్షల ఓటర్లు అనొమలీస్**




హైద్రాబాద్ ఆగస్ట్ 12; రాష్ట్రంలో 3 కోట్ల 38 లక్షల ఓటర్లు ఉండగా అందులో నుండి 73 లక్షలను తొలగించడం అందులో 9,22,230 చనిపోయినవారు, 11,25,546 ఆబ్సెంట్/అన్ ట్రాసెబుల్, 45,18,961 పర్మనెంట్లీ షిఫ్టెడ్, 6,70,203 ఆల్రెడీ ఎన్రోల్డ్, 1.02.294 అదర్స్ అని తొలిగించడం అలాగే సుమారు 63లక్షల ఓటర్లు అనొమలీస్ లో ఉండడం అసాధరమైన విషయం అని, ఈ ఓటర్లని లోతుగా పరిశీలించకుండా తొలగించకూడదని, రే వెరిఫికేషన్ చెయ్యాలని కోరడం జరిగినది.

కాంగ్రెస్ పార్టీ పక్షాన ఈ 73 లక్షల ఓటర్ల వివరాలు బూత్ వారీగా ఇవ్వాలని ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి గారిని టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, ఎస్ ఐ ఆర్ స్టేట్ కో ఆర్డినేటర్ గంప వేణుగోపాల్ తో కలిసి కోరడం జరిగినది.

ఈ ఓటర్ల వివరాలు వచ్చాక కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ ప్రతి ఓటర్ ఇంటికి వెళ్లి పరిశీలించాలని కోరడం జరుగుతుందనిటీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చెర్మెన్
పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు.

# పిల్లల అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఆగస్టు 12, 2026 ఆదిలాబాదు: విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ హాల్ లో జిల్లాలోని 176 కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల విద్యాశాఖాధికారులతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు, పిల్లల అభ్యసన సామర్థ్యాల పెంపుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన బేస్‌లైన్ టెస్టు నివేదికలను ఒకటి రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా సబ్మిట్ చేయాలని సూచించారు. అభ్యసన పురోగతిని పర్యవేక్షించేందుకు స్పష్టమైన క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి నెల 26వ తేదీన పాఠశాల స్థాయిలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్ష జరిపి విద్యార్థుల ప్రగతిని నిర్ధారించుకోవాలన్నారు. అలాగే ప్రతి నెల 27న ఎంఈఓల సమక్షంలో మండల స్థాయి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హెచ్ఎంలు, ఎంఈఓలతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి వచ్చే ఉపాధ్యాయులు తమ పాఠశాల ఎఫ్ఎల్ఎన్ నివేదికలతో హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, ఏఎంఓ లక్ష్మణ్, అజయ్, సీఎంఓ తిరుపతితో, రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు నిఖిల్, వెంకటేష్, నికిత తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర పనులలో జాప్యం మంత్రి నిమ్మల ఆగ్రహం

విజయవాడ పుష్కర ఎత్తిపోతల పథకం పైప్ లైన్ పనులపై మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్ష లో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహ మూర్తి, ఈఈ లు, మరియు కాంట్రాక్టు ఏజెన్సీ ల ప్రతినిధులు పాల్గోన్నారు.ఇటీవలే పుష్కర ఎత్తిపోతల పైప్ లైన్ పనులకు సంబంధించి, సీఎం చంద్రబాబు కు వర్క్ షెడ్యూల్ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం పనుల జరుగుతున్నాయో లేదో పరిశీలించి, మంత్రి నిమ్మలకు ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు రిపోర్ట్ అందించారు. పనులు వేగవంతమవ్వకపోవడం పై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులపై మంత్రి నిమ్మల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీ పనులు పూర్తి చెయ్యక నిర్లక్ష్యం వహిస్తే, ప్రజాప్రయోజనాల నష్టంపై, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించడానికి కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను మంత్రి ఆదేశించారు.

పనులు అలసత్వం పై ఈఈ కి మెమో ఇవ్వాలని ఈఎన్సి ని ఆదేశించారు. ఎల్ నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా, ఎంతో జాగ్రత్త గా కాపాడుకోవాలని చంద్రబాబు ఆదేశించారు.. పుష్కర లిఫ్ట్ స్కీం పైప్ లైన్ పనులు కు సంబంధించి, ప్రతి రోజూ వర్క్ ప్రోగ్రెస్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈనెలాఖరున చంద్రబాబు, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు వెళ్లేలా గోదావరి జలాలు విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు.

# అమెరికాలో హన్మకొండ జిల్లా విద్యార్థి మృతి



## 15 రోజులుగా మృత్యువుతో పోరాడి కన్నుమూత

హన్మకొండ అమెరికాలోని ఫ్లోరిడాలో జూలై 25వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో 75% కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం గంటూర్పల్లికి చెందిన భరత్ చందర్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందాడు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులు ఉన్నత చదువుల కోసం కొడుకును 2023లో అమెరికా పంపారు. అమెరికా నుంచి తిరిగి వచ్చి వివాహం చేసుకుందాం అనుకునే సమయానికి అనుకోని ప్రమాదంలో మృతి చెందాడు. ఉన్నదంతా ఖర్చు చేసినా కొడుకును కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రుల ఆవేదన

# గూడూరు స్వామిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలి...

**హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ధర్నా..**

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత..**

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కేసును తక్షణమే విత్ డ్రా చేసుకోవాలి...?**

హుజూరాబాద్: జర్నలిస్టుల నివేశన స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరించుకోకుండా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గంటపాటు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జక్కని నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీందర్ లు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీ క్యాంప్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఉత్తర్వుల మేరకు మున్సిపల్ అధికారులు హౌస్ నంబర్లు కేటాయించగా, జర్నలిస్టులు లక్షలాది




రూపాయలు వెచ్చించి గృహాలు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. అయితే, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు రాజేశ్వరి భర్త, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గూడూరు అంజలి మామ అయిన కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి అక్కసుతో కోర్టులో కేసు వేశారని మండిపడ్డారు. మూడేళ్లుగా ఆ కేసును ఉపసంహరించుకోకుండా జర్నలిస్టులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యపై రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబులకు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం లభించలేదని నిరసనకారులు వాపోయారు. కేసు విత్‌డ్రా చేయిస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు. గూడూరు స్వామిరెడ్డి తన నిరంకుశ వైఖరిని వీడి వెంటనే కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, దేవసాని ప్రియదర్శిని, సృజన, సందెల వెంకన్నలతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ అధ్యక్షుడిగా ఖాజీ ముతహిర్ జామయీ ఎన్నిక



హోలగుంద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమియత్ అహ్లె హదీస్ మరియు కర్నూలు జిల్లా జమియత్ అహ్లె హదీస్ ఆధ్వర్యంలో కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ నూతన బాధ్యుల ఎన్నిక సోమవారం నిర్వహించబడింది.ఈ ఎన్నికలో ఖాజీ ముతహిర్ జామయీ హాఫిజహుల్లాహ్ కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ అధ్యక్షుడిగా, హాఫిజ్ మంజూర్ ఉపాధ్యక్షులు , అబ్దుల్ జలీల్ ట్రెజరర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జమియత్ బాధ్యులు, సభ్యులు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు మరియు ట్రెజరర్ లకు అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ సంస్థ ఏక దైవారాధన పట్ల విస్తృత అవగాహన కల్పించుట, విద్య సంస్కరణ మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నూతన బాధ్యులు జమియత్ ఆశయాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఖుర్ఆన్ మరియు సున్నత్ సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.చివరగా, నూతనంగా ఎన్నికైన బాధ్యులు తమ బాధ్యతలను నిజాయితీ, అంకితభావం మరియు ఇఖ్లాస్‌తో నిర్వర్తిస్థామని సభాముఖంగా తెలియజేస్తూ, ఇంతటి మహత్తర అవకాశాన్ని కల్పించినందుకు సాదర కృతజ్ఞతలు తెలిపారు.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి పై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెరువుసింగారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతి చెందడం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులు జంతువులను వేటాడుతున్నారన్న సమాచరంతో వారిని పట్టుకునేందుకు మరో ముగ్గురు బీట్ ఆఫీసర్లతో కలిసి వెళ్ళిన నవీన్ బూర్గంపాడు మండలం నకిరేపేట గ్రామంలో విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. ఈ ఘటన పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నవీన్ ను వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్ళినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు డిఎఫ్ఓ మంత్రికి వివరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది పోషిస్తున్న పాత్ర అసమాన్యమైనదని మంత్రి కొండా సురేఖ అన్నారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను అమర్చడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతున్నదని మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ, పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులను చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మృతిచెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అటవీ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం మృతుడు నవీన్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ వినయ్ కుమార్ ను ఆదేశించారు.

# వంట ఏజెన్సీని పై చర్య తీసుకోవాలి.

**సమయానికి అందని మధ్యాహ్న భోజనం.**

**ఉడికి ఉడకని అన్నం వడ్డిస్తున్న ఏజెన్సీ.**

**విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులు భారీ నిరసనూాష**

హోళగుంద, :విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైన వంట ఏజెన్సీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఖాళీ ప్లేట్లతో భారీ నిరసన తెలిపారు.వివరాలోకెళ్తే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు ఒకే వంట ఏజెన్సీ ఉంది.అయితే ఏజెన్సీ కళాశాలకు సమయానికి భోజనం అందించకుండా,ఉడికి ఉడకని అన్నం,నీళ్ల సాంబారు అందిస్తూ విద్యార్థుల కడుపు కొడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు,విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ముందుగా వంట ఏజెన్సీని తొలగించి జూనియర్ కళాశాల నందు మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు వంట ఏజెన్సీని నియమించాలని తహసీల్దార్ లక్ష్మీ రాజు, ఎంఈఓ – 2 కబీర్ సాబ్ కు వినంతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థినీయులు ఉష,యోగిత మాట్లాడుతూ వంట ఏజెన్సీ నాణ్యమైన భోజనం అందించడం లేదని మరియు సమయానికి మధ్యాహ్న భోజనం అందడం లేదని తెలిపారు.అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వంట ఏజెన్సీ పై చర్య తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా విద్యార్థుల కడుపు కొడుతున్న ఏజెన్సీ పై చర్యలు తీసుకోకపోతే విద్యార్థులతో రాస్తా రోకా చేస్తామని హెచ్చరించారు.అలాగే జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు కొత్త ఏజెన్సీ నియమించాలన్నారు.ఇందుకు స్పందించిన తహసీల్దార్ లక్ష్మీ రాజు రెండు రోజుల్లో త్రీమెన్స్ కమిటీతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.దీంతో విద్యార్థులు నిరసన విరమించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ ఉచ్చిరప్ప,చిన్న,సతీష్,హాసనప్ప,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభం.. శిక్షణ ఇస్తున్న ఎంఈఓ



చాగలమర్రి . రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడి టీచర్లకు ఐ సి డి ఎస్ నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శేషశైనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవయ్య, సూపర్వైజర్ సుశీల పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసీసీ జాతీయ విద్యా విధానం, శిశు అభివృద్ధి, పౌష్టికాహారం, ఆరోగ్య విద్యపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి అంగన్వాడి టీచర్లు హాజరయ్యారు.

## గజ్జహల్లి హిందూ స్మశాన వాటికలో దారుణ పరిస్థితి

**శవాలను పూడ్చేందుకు స్థలం లేక పాత సమాధులు తవ్వాల్సిన దుస్థితి**

హోలగుంద మండల పరిధిలో గజ్జహల్లి గ్రామంలోహిందువుల దహన, అంత్యక్రియల కోసం వినియోగిస్తున్న గజ్జహల్లి గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో స్థలం కొరత తీవ్ర సమస్యగా మారింది. ప్రస్తుతం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియల అనంతరం మృతదేహాన్ని పూడ్చేందుకు సరైన స్థలం లేకపోవడంతో గతంలో పూడ్చిన మృతదేహాల సమాధులను తిరిగి తవ్వి, అక్కడే కొత్త మృతదేహాన్ని పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్లుగా స్మశాన వాటికకు సరిపడా స్థలం లేకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఒక కుటుంబ సభ్యుడిని పూడ్చిన స్థలాన్ని కొంతకాలం తర్వాత మరో మృతదేహం కోసం తిరిగి తవ్వాల్సి రావడం తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని గ్రామస్తులు అంటున్నారు.మృతులకు కనీస గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలిగ్రామంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత స్మశాన వాటిక స్థలం ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అదనంగా స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుల అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికే గ్రామ సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అదనపు స్థలం కేటాయించి, గజ్జహల్లి హిందూ స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# ప్రజాబలం ఎఫెక్ట్...

**ప్రభుత్వ హాస్టల్లో నిర్లక్ష్యం నీడలు కథనానికి స్పందన.**

**అడవి మల్లెల గురుకుల పాఠశాలలో సబ్ కలెక్టర్ తనిఖీ...**

**నాలుగు రోజులలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశం.**

**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 12** :ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం అడవి మల్లెలలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సందర్శించారు.హాస్టల్లో నిర్లక్ష్యం నీడలు అని ప్రజాబలం ప్రచురించిన కథనానికి స్పందించి ఎలుకలు విద్యార్థినులను కొరికిన ఘటనపై ఆయన విచారణ చేపట్టారు.

హాస్టల్ పరిసరాలు, విద్యార్థినుల వసతి గదులను పరిశీలించిన సబ్ కలెక్టర్.. ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో పారిశుద్ధ్యం, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

నాలుగు రోజుల్లోగా సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదేశించారు.



# ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా బార్‌ల నిర్వహణ?



**జహీరాబాద్, ఆగస్టు 12 ప్రజాబలం ప్రతినిధి:** ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా జహీరాబాద్‌లోని కొన్ని బార్‌లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సితార రెస్టారెంట్ అండ్ బార్‌కు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలపై సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్‌కుమార్ ఆధారాలతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బార్‌కు కేటాయించిన మద్యం ఇతర ప్రాంతాలకు తరలించడం, అనధికార విక్రయ కేంద్రాలకు చేరడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

తూతూమంత్రంగా తనిఖీలు?

ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని, పత్రికల్లో వార్తలు వచ్చిన తర్వాతే హడావుడిగా తనిఖీలు చేయడం సరికాదని సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన రాలేదని తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

బుధవారం సితార బార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సంతోష్‌కుమార్ తెలిపారు. బార్ స్టాక్ రికార్డులు, మద్యం బాటిళ్ల సరఫరా వివరాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఫిర్యాదును రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**గిరిజన సంప్రదాయాల నడుమ వనదేవతల దర్శనానికి ప్రణాళికబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేయాలి.**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**మేడారం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 12 మేడారం**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 16వ తేదీన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ సందర్శన, గిరిజన సంస్కృతి సాంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతల దర్శనానికి ప్రణాళిక బద్ధంగా అన్ని పనులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.





బుధవారం తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, హెలప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్ లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలిప్యాడ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రత, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

సమ్మక్క--సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై గుత్తేదారుతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే మిగిలిపోయిన గ్రానైట్ రాళ్లు, నిర్మాణ వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత గుత్తేదారునకు ఆదేశించారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించే సందర్భంగా ఆశీర్వచనాలు, శేషవస్త్రాల సమర్పణ, మొక్కులు చెల్లించడం తదితర కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆలయ ఈవోను కలెక్టర్ ఆదేశించారు.


వనదేవతల ప్రాంగణం చుట్టుపక్కల గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టి మొక్కలు నాటాలని, ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన భారీ పీటీ బీమ్స్‌ను పూలతో ఆకర్షణీయంగా సుందరీకరించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా కనిపించేలా సుందరీకరణ పనులను పూర్తి పూర్తి చేయాలన్నారు.

వనదేవతల దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించనునన్నందున అవసరమైన ఏర్పాట్లతో సిద్ధం చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అన్ని చోట్ల పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వాహనాల నియంత్రణ, ప్రోటోకాల్, రాకపోకలు, ఆలయ పరిసరాల్లో భద్రత తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, ఆలయ ఈవో వీరస్వామి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సింగ్, గుత్తేదారులు ఆదినారాయణ, తాడ్వాయి తహసిల్దార్ సురేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు సందేశం.





**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 ప్రజాబలం** : గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారంలో పోస్ట్ కార్డు క్యాంపెయిన్ లో భాగంగా సీఎంకు సమస్యలపై సంతకాల సేకరణ చేసి పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1970 దశకంలో గిరిజన సంక్షేమ శాఖ యాజమాన్యంలో ప్రారంభమైన పాఠశాలలు మారుమూల ఏజెన్సీ, గిరిజన గ్రామాల్లో ఎందరో గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి ఉన్నతికి కారణమైన పాఠశాలలు,నేడు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు.అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రెసిడెన్షియల్,గురుకులాలపై చూపుతున్న శ్రద్ధ,పెడుతున్న ఖర్చులో కనీసం కొంచెమైనా గిరిజన సంక్షేమ పాఠశాలలపై పెడితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ,జిల్లా పరిషత్ పాఠశాలల్లో వేలాది పండిట్స్, పీఈటీ పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 నుండి 400మంది పండిట్స్,పీఈటీ పోస్టులను నేటికీ అప్ గ్రేడ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ గిరిజన ఉపాధ్యాయులపై సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నదని మండిపడ్డారు.ఇప్పటికైనా పండిట్స్,పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చేసి ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు.క న్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించి 13 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ ఒక్క పోస్టు మంజూరు చేయకుండ తాత్కాలిక ఉపాధ్యాయులతో నడిపించటం దారుణమన్నారు.వెంటనే కన్వర్టెడ్ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మిగిలిన హాస్టల్స్ ను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులు ట్రైబల్ ఎంఈఓ,ట్రైబల్ డిప్యూటీ డిఇఓ, పిఎంఓ,ఏసిఎంఓ పోస్టులను మంజూరు చేయాలని,జేఎల్ గా పదోన్నతి కల్పించాలని, గిరిజన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు మంజూరు చేయాలని,ఆశ్రమ పాఠశాలలకు కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఏఎన్ఎం లను మరియు స్కావెంజర్ పోస్టులను నియమించాలన్నారు .ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సి.ఆర్.టి లకు బేసిక్ పే ఇవ్వాలని, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. సీఎంగా మీరు పై సమస్యలపై జోక్యం చేసుకొని గిరిజన సంక్షేమ రంగంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తారనే నమ్మకంతో ఈ లేఖ ద్వారా మా సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నామని, వెంటనే స్పందించి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు బి.శోభన్,బి.రవి,వి. రమేష్, పి.శ్రీనివాస్, కే.శ్యామల, బి.రవి (హిందీ) బి.సక్రాం,జె. నాగేశ్వరరావు, నాగమణి,డి.ఉషశ్రీ, నలిని,కపూర్య తదితరులు పాల్గొన్నారు.

# సండ్రపై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన బీఆర్ఎస్ శ్రేణులు.



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 12:** మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సండ్ర వెంకట వీరయ్యపై పిడమర్తి రవి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం సరికాదని పేర్కొన్నారు.

సైబర్ నేరాలకు సంబంధించిన అంశాలపై పోలీసులు, దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు వాస్తవాలను తేలుస్తాయని, దర్యాప్తు పూర్తికాకముందే ఆరోపణలను రాజకీయంగా ఉపయోగించుకోవడం తగదన్నారు. ఆధారాలు లేకుండా వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని అన్నారు.మాక్కూడా మాట్లాడటం వచ్చు.. కానీ వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలను రాజకీయ విమర్శల్లోకి లాగడం మా సంస్కారం కాదు" అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. సండ్ర వెంకట వీరయ్య కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలపై ఉండాలి తప్ప వ్యక్తిగత అంశాలపై కాదని హితవు పలికారు. ఇకనైనా పిడమర్తి రవి బాధ్యతాయుతంగా మాట్లాడాలని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు.

# స్కూల్ చిన్నారులకు ప్యాడ్స్ పెన్సిల్లు పంపిణి.



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 12 ప్రజాబలం:**సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి జన్మదినం సందర్భంగా ఇచ్చిన పిలుపుమేరకు స్కూల్ పిల్లలకు ఉపయోగపడే వస్తువులు ఇవ్వాలని ఉద్దేశంతో మల్లవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ మల్లవరంలోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు ప్యాడ్స్ పెన్సిల్లు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అందుకోవాలని ఉన్నత భవిష్యత్తును ఎంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రాగమయికు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు

# పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి, ఆగస్టు -12, ప్రజాబలం ప్రతినిధి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు



చెందిన వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా, ప్రజలకు అందించే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వాహనాల్లోని సమాచార ప్రసార పరికరాల పనితీరును పరిశీలించారు.

అదేవిధంగా ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు,ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు, రక్షణ సామగ్రి కిట్‌లో భాగంగా హెల్మెట్, రాళ్ల దాడి నుంచి రక్షణ కవచం, లాఠీ, శరీర రక్షణ కవచం, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వాహనాల నిర్వహణలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ప్రతి నెలా సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. పోలీస్ వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వాటిని ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచాలని వాహన డ్రైవర్లకు సూచించారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సొంత వాహనాల మాదిరిగా జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్ణీత వ్యవధిలో వాహనాల మరమ్మతులు, ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాల నిర్వహణపై డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలపై వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రసవం కోసం పోతే ప్రాణం తీశారు

## ఇది సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీరు మూడు రోజులు వైద్యం చేసి ఆరోగ్యం బాగానే ఉందన్నారు

**అందోల్ నియోజకవర్గశీ ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణీ ప్రాణాలు కోల్పోయిన ఘటన ఈరోజు బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర విషాదాన్ని నింపింది, వైద్యుల నిర్లక్ష్యమే తమ కూతురు చావుకు కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు, చౌటకూర్, మండలం బద్రి గూడెం, గ్రామానికి చెందిన అనిత,(33)సంవత్సరాలు భర్త శ్రీశైలం, 9 నెలల గర్భిణీ అయిన ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10వ తేదీన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఈరోజు







ఉదయం 5 గంటల సమయంలో అనితకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి మృతి చెందిందని వైద్యులు తెలుపుతున్నారు,అనిత మృతి వార్త తెలియడంతో ఆగ్రహించిన బంధువులు వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు.సమయానికి, సరైన వైద్యం అందించలేదు డాక్టర్లు, సిబ్బంది, నిర్లక్ష్యం చేయడం వల్లే అనిత, ప్రాణాలు కోల్పోయింది అని ఆరోపించారు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత డాక్టర్లు మరియు వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు,దీంతో ఆసుపత్రి ఆవరణలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న సంగారెడ్డి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు,ఆందోళన చేస్తున్న బంధువులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు,ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకం ఉంచి పేద రోగులు వస్తే వైద్యులు సరైన చికిత్స నిర్వహించగా పోవడంతో పేద ప్రజలు మృతి చెందుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్ ఎల్బీ నగర్ ఏసీపీ కార్యాలయంలో ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఘటన చోటు చేసుకుంది. మృతుడు ఎల్బీనగర్ పీఎస్కు చెందిన ఖఅ ఏ. సాయికుమార్ (13128). ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్రూమ్లో ఉరివేసుకున్నట్లు గుర్తించారు. సాయికుమార్ 2024 బ్యాచ్లో ఎంపికయ్యాడు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఏసీపీ కార్యాలయానికి అటాచ్మెంట్ లో వున్నాడు. కర్మన్ఘాట్లో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివాసం వున్నాడు.

# సీఎంఆర్ రైస్ సరఫర గడువు లోగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ శ్రీరాములు



**పెద్దపల్లి, ఆగస్టు-12, ప్రజాబలం ప్రతినిధి:** రబీ 2024-25 సీజన్ కి సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ బి శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో సిఎంఆర్ రైస్ డెలివరీ పై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సకాలంలో అందించాలని, సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని రైస్ మిల్లులలో ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారం రా రైస్, పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన సి.ఎం.ఆర్. ను గడువు లోగా పూర్తి చేయుటకు ఎఫ్.సి. ఐ అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్లకు సంబంధించి రోజువారీగా రిజిస్టర్ నమోదు చేయాలని, గన్ని సంచుల కోతలు, నెంబర్స్ నమోదు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దిడ్గిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 7 మంది అరెస్ట్



**జహీరాబాద్, ఆగస్టు 12 ప్రజాబలం ప్రతినిధి:** దిడ్గి గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని జహీరాబాద్ రూరల్ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఎస్సై రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దిడ్గి గ్రామంలోని ఎం.డి. ఖాజా వ్యవసాయ భూమిలో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,160 నగదు, 52 పేకముక్కలు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై రాజేందర్ రెడ్డి తెలిపారు.

పేకాట, జూదానికి దూరంగా ఉండాలి

పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్సై రాజేందర్ రెడ్డి కోరారు.

# జాతీయ సమగ్రతను కాపాడడం కోసమే హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి

**పెద్దపల్లి/మంథని ఆగస్టు -12, ప్రజాబలం ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ కి ముఖ్య అతిధిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి పాల్గొని జెండా ఊపి ర్యాలీ ని ప్రారంబించారు గాంధీ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు మంథని పుర వీధులగుండా భారీ జాతీయ పతకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచనల మేరకు మంథని పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించడం ఆనందంగా ఉంది ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించడానికి,



జాతీయ సమగ్రతను అస్తిత్వాన్ని కాపాడం కోసం దేశ ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకురావాలని దృఢ సంకల్పంతో మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలువు నివ్వడం జరిగింది 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరేయాలని అన్నారు. ఎందరో స్వాతంత్ర సమరయోధుల ఆత్మార్పణ బలిదానాల వల్ల మనకు స్వాతంత్రం వచ్చిందని వారి యొక్క ఆశయాలకు అనుగుణంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రగామిగా విశ్వ గురువుగా చేస్తున్నారు అన్నారు. ఈకార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్, సుమారు వేయికి పైగా అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్. నగదు మోటార్ సైకిల్ స్వాధీనం కేసు నమోదు.




**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 12 ప్రజాబలం:**మండల కేంద్రంలోని ధార శ్రీనుకు చెందిన పప్పుల మిల్లులో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై బుధవారం తల్లాడ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 18350 రూపాయల నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకారపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తల్లాడ పోలీసులు హెచ్చరించారు.

# జరాసంగం కేతకిలో భక్తుల సందడి



**జహీరాబాద్ ఆగస్టు 12 ప్రజాబలం ప్రతినిధి :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన జరా సంఘం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి బుధవారం అమావాస్య సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4:30 గంటలకే నిత్య పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.ముందుగా భక్తులు అమ్మవారి గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## మానవతాదృక్పథంతో ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న మంత్రి

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 12 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** పుల్కల్ మండల కేంద్రానికి చెందిన, దూదేకుల ఆసిఫ్, (తండ్రి )దూదేకుల ఆబేద్, చికిత్స (రీకాంబినేట్ హ్యూమన్ గ్రోత్ హార్మోన్ రీప్లేస్మెంట్,) రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి,దామోదర్ రాజనర్సింహా, చొరవతో దూదేకుల ఆసిఫ్ కు, (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా వైద్య సహాయం మంజూరు అయింది, మంజూరైన మొత్తం రూ, 2.75.000 ఆసిఫ్,కు అవసరమైన వైద్యం అందించేందుకు, ఆర్థిక సహాయం చేయడంలో మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక చొరవ చూపారు, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత ప్రజలకు అండగా మంత్రి దామోదర్ రాజనర్సింహా

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచాలి

**విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం**

**క్షేత్రస్థాయి పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలి -- అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**



**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా IDOC భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు వివిధ విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు (వీజూలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జ త్రాలు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను సంబంధిత వీజూలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, వివిధ ప్రభుత్వ సదుపాయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాలల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వీజూలు క్షేత్రస్థాయిలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగినప్పుడే విద్యాశాఖ కార్యక్రమాల అమలులో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు వీజూలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జ త్రాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు, హాజరు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షించిన అంశాలు, శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరించారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026 - సెలబ్రేటింగ్ ఎక్సలెన్స్ ఇన్ తెలంగాణ.




హైదరాబాద్, 12 ఆగస్టు 2026: రౌండ్ టేబుల్ ఇండియా తెలంగాణలోని వివిధ రంగాలలో విశేషంగా రాణించిన అచీవర్స్ మరియు ఎమర్జింగ్ వ్యక్తులను సన్మానించేందుకు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ యొక్క 7వ ఎడిషన్ను గర్వంగా ప్రకటిస్తోంది.

ఈ అవార్డులు మన సమాజ అభివృద్ధికి గణనీయంగా దోహదపడిన వ్యక్తులను మరియు సంస్థలను గౌరవిస్తుంది.

2026 అవార్డుల విభాగాలు:

ఈ సంవత్సరం, అవార్డులు 15 విభాగాలలో ఇవ్వబడతాయి: కళలు మరియు సంస్కృతి, ఎన్జీవో, స్టార్ ఉమన్, స్టార్ కిడ్,
వినోదం, విద్య, స్టార్ట్-అప్, హెల్త్ కేర్, ఫుడ్ అండ్ బేవరేజెస్, రిటైల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్ఫ్లుయెన్సర్ , సస్టైనబిలిటీ ఎక్సెలెన్స్ ,
పరిపాలన సేవలు మరియు క్రీడలు. పైన పేర్కొన్న రంగాలలో విజయం పొంది మరియు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక అచీవర్ మరియు ఒక ఎమర్జింగ్ వ్యక్తిని సన్మానిస్తారు.

నామినేషన్ మరియు ఓటింగ్ ప్రక్రియ:

గత ఎడిషన్ 2000 నామినేషన్లు మరియు 1,50,000 పబ్లిక్ ఓట్లతో విజయవంతమైన చరిత్రను సాధించిన తరువాత, ఈ
సంవత్సరపు నామినేషన్ల కోసం 13 ఆగస్టు నుండి 27 ఆగస్టు 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026 జ్యూరీ:

ఈ సంవత్సరం అవార్డుల ప్రదానం చెయ్యడం కోసం గౌరవనీయమైన జ్యూరీ సభ్యుల ప్యానెల్ను కలిగి ఉండడం మాకు
గర్వకారణం:

శ్రీమతి లక్ష్మీ నంబియార్, స్థాపకులు, సృష్టి ఆర్ట్ గ్యాలరీ

శ్రీ ముజ్తబా హసన్ అస్కరీ, వ్యవస్థాపకులు ఝుఎజూ; మేనేజింగ్ ట్రస్టీ, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్.

శ్రీ పి.రఘురామ్, స్థాపకులు, కిమ్స్-ఉషాలక్ష్మి హాస్పిటల్

శ్రీ రాజ్ కందుకూరి, జాతీయ అవార్డు గ్రహీత,సినీ నిర్మాత, దర్శకులు మరియు పంపిణీదారు.

శ్రీ ఎం. వి. రమణ, ముఖ్య కార్యనిర్వహణాధికారి, డా. రెడ్డీస్ ల్యాబ్స్.

శ్రీ రమేష్ కాజ, కంట్రీ హెడ్- ఇండియా, ఎల్. పి. ఎల్. ఫైనాన్షియల్ హైదరాబాద్.

శ్రీ సందీప్ సుల్తానియ, ఆర్థిక కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వం.

శ్రీ షాహ్ అజీమ్ హమీద్, ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఫెయిర్మోంట్ బిల్డర్స్.

శ్రీమతి శ్రీవిద్య రెడ్డి గుణంపల్లి, ఉపాధ్యక్షులు, జి. ఎన్. ఐ. టి. ఎస్. (GNITS)

శ్రీ శ్రీనివాస రావు మహంకాళి, అడ్జంట్ ప్రొఫెసర్, ఎ. ఎస్. సి. ఐ. (ASCI) అడ్వైసర్: ఐ.ఐ.ఎల్.ఎం ఢిల్లీ, ఎస్ ఐ యు, తిరుపతి

పొసీడెక్స్ టెక్నాలజీస్, హైదరాబాద్ అభైరో క్యాపిటల్ బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రిప్రెన్యూర్షిప్.

మా స్పాన్సర్లు:లి

మా ప్రధాన స్పాన్సర్లకు మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము- టైటిల్ స్పాన్సర్: ఫెయిర్మోంట్ బిల్డర్స్,
పవర్డ్ - బై స్పాన్సర్: ఎస్ ఎ ఎస్ ఇన్ఫ్రా , కో - స్పాన్సర్లు : నీమన్స్, శ్రీ జగదాంబ పర్ల్స్, బిగ్ ఎఫ్ఎమ్, నోవొటెల్, మినార్ ఆటా.

రౌండ్ టేబుల్ ఇండియా - విద్య పట్ల నిబద్ధతలి:

రౌండ్ టేబుల్ ఇండియా 2025 ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుల ద్వారా నిధులు సమకూర్చి 4 కొత్త స్కూల్ బ్లాక్లను తెలంగాణలో
ప్రారంభించింది, అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి:

MPPS మేకగూడలో 6 తరగతి గదులు
MPPS మౌలాలి లో 3 తరగతి గదులు
MPPS అల్వాల్ లో 2 తరగతి గదులు
MPPS నర్సాపూర్ లో 4 తరగతి గదులు

రౌండ్ టేబుల్ ఇండియా 1997 నుండి 4,108 పాఠశాలలలో 10,668 తరగతి గదులను నిర్మాణం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం 11.70 మిలియన్ పిల్లల విద్యకు దోహదపడుతోంది.

గ్రాండ్ అవార్డ్స్ నైట్:

రౌండ్ టేబుల్ ఇండియా అవార్డుల వేడుక 03 అక్టోబర్ 2026న షెడ్యూల్ చేయబడింది. ఈ వేడుక తెలంగాణ రాష్ట్రము యొక్క
ప్రతిభను సన్మానించే మరియు గుర్తించే వేడుక.

నామినేషన్కు ఆహ్వానం:

తెలంగాణ రాష్ట్ర నివాసులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు, పాల్గొనేవారు తమను తాము లేదా ఇతరులను
www.prideoftelangana.com లేదా info@prideoftelangana.com కు ఇమెయిల్ ద్వారా తమ ఎంట్రీలను
సమర్పించవచ్చు. ఈ వేదిక అర్హులైన వ్యక్తుల కఠిన పరిశ్రమ మరియు విజయాలను గుర్తించడానికి ఒక అద్భుతమైన
అవకాశాన్నిస్తుంది. రౌండ్ టేబుల్ ఇండియా తన కార్యక్రమాల ద్వారా విద్యను ప్రోత్సహించడానికి మరియు సమాజ సేవ
చేయడానికి తన నిబద్ధతను కొనసాగిస్తుంది, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులు మన రాష్ట్రం లోని ప్రతిభ మరియు
అంకితభావాన్ని గుర్తించే కీలక వేదిక.

రౌండ్ టేబుల్ ఇండియా గురించిన పరిచయం:

1927లో ఇంగ్లాండ్లోని నార్విచ్లో స్థాపించబడిన రౌండ్ టేబుల్, 52 దేశాలలో 43,000 కంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక గ్లోబల్
ఫ్రెండ్షిప్ ఆర్గనైజేషన్గా వృద్ధి చెందింది. భారతదేశంలో, 1957 నుండి రౌండ్ టేబుల్ యాక్టివ్గా ఉంది, 320 కంటే ఎక్కువ టేబుల్స్ మరియు 4,600o సభ్యులతో జీరో- ఓవర్హెడ్ పాలసీకి పేరుగాంచింది. సేకరించిన అన్ని నిధులు దాతృత్వ లక్ష్యాల కోసం,
ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలల నిర్మాణంపై వెచ్చించేలా RTI దృష్టి సారిస్తుంది.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కు నివాళు లర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 ప్రజాబలం:**విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ మృతదేహానికి పలువురు ఉన్నత అధికారులు, నాయకులు నివాళులర్పించారు.సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండాలో బుధవారం నవీన్ అంత్యక్రియలు జరిగాయి. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్ తోపాటు అటవీశాఖ ఉన్నత అధికారులు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డిఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ పలువురు ప్రజాప్రతినిధులు నవీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరుపునా అండహా ఉంటామని తెలిపారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కలెక్టర్ తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మృతుడు నవీన్ కు భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com